



పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న జిల్లా పరీక్షల అబ్జర్వర్ సుబ్బారావు

నేటి నుంచి 'పది' పరీక్షలు

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

పదవ తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించి ఏర్పాట్లను అధికారులు ఇప్పటికే పకడ్బందీగా పూర్తి చేశారు. ఎలాంటి అవకతవకలు చోటు చేసుకోకుండా ఉండే విధంగా అన్ని పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన చర్యలను చేపట్టారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 32803 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగనున్నాయి. మొత్తం 135 కేంద్రాల్లో పరీక్షలు జరుగనున్నాయి. పరీక్షలు జరిగే కేంద్రాల్లో ఇప్పటికే రోలింగ్ నంబర్ల ఏర్పాటు పూర్తి చేశారు. ఈ పరీక్షలతోపాటు, దూరవిద్య పదవ తరగతి పరీక్షలు కూడా సోమవారం నుంచే ప్రారంభం కానున్నాయి. 11 కేంద్రాల్లో 1414 మంది విద్యార్థులు ఈ పరీక్షలు రాయనున్నారు. వేసవి కాలం కూడా కావడంతో పరీక్షా కేంద్రాల్లో ఫ్యాన్లు, లైటింగుతోపాటు, తాగునీటి వసతి కల్పించారు.

పరీక్షా కేంద్రాల సమీపంలో 144 సెక్షన్

గతంలో పరీక్షా పత్రాల లీకేజీలను దృష్టిలో ఉంచుకుని కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను చేస్తున్నారు. ఏర్పాట్లకు సంబంధించి ఎటువంటి చర్యలు తీసుకోవాలన్న దానిపై జిల్లా కలెక్టరు వినోద్‌కుమార్ అధికారులు స్పష్టమైన ఆదేశాలు ఇది వరకే ఇచ్చారు. పరీక్షలు జరిగే కేంద్రాల సమీపంలోనున్న జిరాక్స్ కేంద్రాలను మూసివేస్తున్నారు. అదే విధంగా 144 సెక్షన్‌ను ఆ ప్రాంతాల్లో అమలు జరుపుతున్నారు. పరీక్ష విధులకు హాజరేయ్యే సిబ్బంది కూడా విధిగా ఐడి కార్డులు ధరించి రావాలని ఆదేశాలిచ్చారు.

పరీక్షా కేంద్రాల వద్ద ఎఎన్ఎం

పరీక్షా కేంద్రాల్లో వైద్య సిబ్బందిని నియమించారు. ఒక ఎఎన్ఎంను నియమించారు. దీంతోపాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు అందుబాటులో ఉంచుతున్నారు. పరీక్షలకు వచ్చే వారి కోసం ఉచితంగా ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించారు. పాత బస్సుపాసుగాని, హాల్ టిక్కెట్టుగాని చూపించి విద్యార్థులు ఉచితంగా ఆర్టీసీ బస్సులో పరీక్షకు వెళ్లేందుకు అనుమతినిచ్చారు. అయితే పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు విధిగా సమయానికి హాజరవ్వాలని సూచిస్తున్నారు. ఒక్క నిమిషం ఆలస్యమైన లోపలికి అనుమతించబోమని చెబుతున్నారు. దీంతో నిర్ణీత సమయం కంటే అరగంట ముందుగానే విద్యార్థులు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

కేంద్రాలను పరిశీలించిన జిల్లా అబ్జర్వర్

పదో తరగతి పరీక్షల జిల్లా అబ్జర్వర్ సుబ్బారావు ఏసీ గోవింద నాయక్‌తో కలసి పలు పరీక్ష కేంద్రాలను ఆదివారం పరిశీలించారు. నగరంలోని శ్రీ పొట్టి శ్రీరాములు నగరపాలక బాలురు ఉన్నత పాఠశాల, శారద నగరపాలక బాలికల ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అబ్జర్వర్ మాట్లాడుతూ విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. అదేవిధంగా సిఎస్, డిఓలు ఉదయం 7:30 గంటలకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, ఇన్విజిలేటర్లు 8 గంటలకు చేరుకోవాలని ఆదేశించారు. అంతేకాకుండా సిఎస్, డిఓలు, ఇన్విజిలేటర్లు, స్క్వాడ్‌బృందాలు తమ సెల్ ఫోన్‌ను పరీక్ష కేంద్రంలోకి తీసుకెళ్లకూడదన్నారు. సిఎస్ మాత్రం తమ సెల్ ఫోన్‌ను ప్రధానోపాధ్యాయుని గదిలో పెట్టి అత్యవసరమైతే ఆ గది నుండి ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు. సోమవారం నుంచి ప్రారంభమయ్యే పదవ తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి సర్వం సిద్ధం చేసినట్లు డీఈవో ప్రసాద్ బాబు ఏసీ గోవింద నాయక్ తెలిపారు.

పారిశుధ్యం.. అస్తవ్యస్తం

- ◆ రూ. కోట్లు కరుగుతున్నా ఫలితం సున్నా
- ◆ మూలన పడ్డ చెత్త సేకరణ వాహనాలు
- ◆ పొంచి ఉన్న వ్యాధుల ముప్పు



రహమత్ పురం మార్కెట్ ఎదురుగా ఉన్న చెత్తకుప్ప

హిందూపురం పురపాలక సంఘ వ్యాప్తంగా పారిశుధ్యం అస్తవ్యస్తంగా తయారైంది. ప్రతి వీధిలోనూ చెత్త పేరుకు పోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. కొన్ని వీధుల్లో, కాలువల్లో ఉన్న వ్యర్థాలను నెలల తరబడి తొలగించడం లేదు. దీనికి తోడు పట్టణంలో నూతన కాలువల నిర్మాణం లేకపోవడంతో చాలా ప్రాంతాల్లో మురుగు నీరంతా రహదారులపై చేరుతోంది. ప్రభుత్వం ప్రతి 2 వేల కుటుంబాలకు ఓ సచివాలయం చొప్పున వ్యవస్థను అందుబాటులోకి తెచ్చినా పరిస్థితిలో ఎక్కడా మార్పు కనిపించడం లేదు.

ప్రజాశక్తి-హిందూపురం

క్షేత్రస్థాయిలో పర్యటించని కార్యదర్శులు....

పట్టణంలోని ప్రధాన రహదారుల వెంట నిర్మించిన కాలువల్లో నెలలు గడుస్తున్నా వ్యర్థాలను తొలగించడం లేదు. ఫలితంగా పట్టణంలో దోమలు స్వైర విహారం చేస్తూ ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పట్టణంలో మొత్తం 38 వార్డుల్లో 43 సచివాలయ పారిశుధ్య కార్యదర్శులు, దాదాపు 365 మంది కార్మికులు విధుల్లో ఉన్నారు. సచివాలయాల వారీగా పారిశుధ్య నిర్వహణను కార్మికులకు కేటాయించారు. వారంతా ఆయా కార్యదర్శుల పర్యవేక్షణలో ఉంటూ పనులు చేయాల్సి ఉంది. కానీ కొంత మంది కార్యదర్శులు క్షేత్రస్థాయిలో పర్యటించ కుండా ఇళ్ల వద్ద నుంచే మార్గదర్శకాలు ఇస్తున్నారు. దీంతో పర్యవేక్షణ కొరవడి ఎక్కడి చెత్త అక్కడే ఉండిపోతోంది. రహమత్‌పురం రైల్వే స్టేషన్ ఎదురుగా, ఎల్ఐసి కార్యాలయం, హస్నాబాదు రోడ్డు, బెంగళూరు రోడ్డు, బాలాజీ టాకీస్ రోడ్డు, ధర్మపురం, ఆజాద్ నగర్, ఆర్‌టిసి కాలని, త్యాగరాజ్ నగర్ తదితర ప్రాంతాలలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఆర్‌పిజిటి రోడ్డులో అసుపత్రి నిర్వాహకులు అసుపత్రి వ్యర్థాలను పడేస్తున్నారు. వాటిని రోజుల తరబడి తరలించకుండా అలాగే ఉంచుతుండడంతో పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. సందులు, కాలనీల్లో చెత్త సేకరణ నుంచి మురుగు కాలువల శుభ్రంపై ఏ మాత్రం దృష్టి సారించడం లేదు. నెలకు కార్యదర్శుల నుంచి కార్మికుల వరకు సుమారు అరకోటి వరకు వేతనాల రూపంలో ఖర్చు అవుతున్నప్పటికి పారిశుధ్యం మాత్రం అధ్వానంగా మారింది. పారిశుద్య నిర్వహణకు కోట్ల రూపాయలు కరుగుతున్నా పట్టణ వాసులకు దోమల కాట్లు మాత్రం తప్పడం లేదు.

ఫాగింగ్ ఊసే లేదు

ప్రజల ప్రాణాలకు పెద్దపీట వేయాల్సిన కొందరు అధికారులు, పాలకులు వారి సొంత లాభార్జన కోసం పాకులాడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు బ్లీచింగ్, పాగింగ్ వంటి పనులు చేపట్టాల్సి ఉంది. కాసులకు కక్కుర్తి పడే కొందరు బ్లీచింగ్ పౌడర్ స్థానంలో చాక్ పీసులు తయారు చేసే తెల్ల సున్నం పొడిని వినియోగిస్తున్నారనే ఆరోపణలున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు, పాలకుల పర్యటనలున్నా సమయంలోనే అది కూడా వినియోగిస్తున్నారే తప్ప తక్కిన సమయాల్లో దాని ఊసే లేదు. రసాయనాలతో కూడిన మిశ్రమాన్ని పాగింగ్ చేయించాల్సిన అధికారులు ఫాగింగ్ సైతం చేయించడం లేదు. కాలువల్లో దోమల లార్వా నివారణ కోసం పిచికారి చేయాల్సి ఉంది. ఇది సైతం చేయడం లేదు. అయితే పూర్తి స్థాయిలో బ్లీచింగ్, ఫాగింగ్ చేయిస్తున్నట్లు దస్త్రాల్లో నమోదు చేస్తూ నిర్వహణ నిమిత్తం లక్షల రూపాలయ ఖర్చు చూపిస్తు ప్రజాధనాన్ని కొందరు అధికారులు భారీగా దండుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

మూలన పడ్డ చెత్త సేకరణ వాహనాలు

పట్టణంలో చెత్తను సేకరించేందుకు అప్పటి ప్రభుత్వం 22 వాహనాలు మంజూరు చేసింది. వాటిని పట్టణంలోని వివిధ ప్రాంతాలలో చెత్త సేకరణ కోసం వినయోగించే వారు. ఇందులో 7 వాహనాలు మరమ్మతుకు గురి కావటంతో అవి మూలన పడ్డాయి. వీటి నిర్వహణ బాధ్యతలను ప్రభుత్వం ప్రైవేటు కంపెనీకి చెందిన గుత్తేదారుకు అప్పజెప్పింది. పురపాలక పరిధిలో చెత్తను సేకరించినందుకు ప్రతినెల గుత్తేదారుకు రూ.60వేలపైగా అద్దె చెల్లించాలి. ఈ వాహనాలతో పురపాలక సంఘంలోని పలు వార్డుల్లో చెత్త సేకరణ చేపట్టే వారు. గుత్తేదారుడు వాహన చోదకులకు సక్రమంగా జీతాలు చెల్లించక పోవడంతో వాహనాలను కొన్ని నెలలుగా నిలిపివేశారు. దీంతో రూ. లక్షల విలువ చేసే వాహనాలను మూలన పడేయడంతో ప్రజాధనం వృథాగా మారిందని పట్టణవాసులు పేర్కొంటున్నారు.



కాలువలో పేరుకుపోయిన మురుగు నీరు



శాంతినగర్ ప్రాంతంలో మురుగు కాలువ పరిస్థితి

18న విజయవాడలో ధర్నా

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

డప్పు కళాకారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 18వ తేదీన విజయవాడలో నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.వెంకటేష్, ఓ.నల్లప్ప తెలిపారు. ఆదివారం కెవిపిఎస్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ డప్పు కళాకారుల సమస్యలు పరిష్కరించాలన్నారు. డప్పు కళాకారులకు 45ఏళ్లకే కనీస రూ.7వేలు పింఛన్ ఇవ్వాలని, డప్పు డ్రెస్సు, గజ్జలతో పాటు ప్రమాద బీమా, రైల్వే, ఆర్‌టిసి ప్రయాణాల్లో రాయితీ ఇవ్వాలని కోరారు. ఆయా సమస్యల పరిష్కారానికే ఈనెల 18న విజయవాడలో నిర్వహించే ధర్నాలో జిల్లాలోని డప్పు కళాకారులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి డప్పు కళాకారుల సంఘం జిల్లా కార్యదర్శి నాగరాజు, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు జగ్గలి రమేష్, సహాయ కార్యదర్శి జీవరత్నం, రూరల్ కార్యదర్శి రాజా, నగర అధ్యక్షులు అక్కులప్ప, జిల్లా కమిటీ సభ్యులు వన్నరప్ప, మల్లికార్జున, భూషణ, రాముునాయక్, శివ, ఓబయ్య, తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు బాటలో నడుద్దాం

కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్



పొట్టి శ్రీరాములు చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కలెక్టర్, తదితరులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

అమరజీవి పొట్టి శ్రీరాములు చిరస్మరణీయులని, ప్రతి ఒక్కరూ ఆయన చూపిన బాటలో నడుద్దామని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం అనంతపురం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో పర్యాటకశాఖ ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి జిల్లా కలెక్టర్ పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు కృషితోనే ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందన్నారు. ప్రతి జిల్లాలోనూ పొట్టి శ్రీరాములు విగ్రహం ఏర్పాటు చేసి రాష్ట్రానికి ఆయన చేసిన కృషిని ప్రభుత్వం గుర్తించిందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఆయన కృషికి గుర్తించి ఆయన బాటలో నడవాలని, రాష్ట్రానికి ఏ విధంగా మేలు చేయగలుగుతామనేది ప్రతి ఒక్కరూ ఆలోచించాలని అన్నారు. ప్రతి ఒక్కరూ అహర్నిశలు కృషి చేస్తూ రాష్ట్రాన్ని, జిల్లాని అభివృద్ధి చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, డిఆర్ఓ ఏ.మాలోల, డిపిఎం ఆనంద్, జిల్లా పర్యటక శాఖ అధికారి జయకుమార్ బాబు, డ్వామా పీడీ సలీమ్ భాష, ఐ.అండ్.పీఆర్ డిఐపిఆర్ఓ గురుస్వామి శెట్టి, కలెక్టరేట్ ఏవో అలెగ్జాండర్, పీఆర్ ఎస్ఈ జహీర్ అస్లాం, ఆర్కియాలజి ఎడి రజిత, పర్యాటక శాఖ సిబ్బంది దీపక్, ఇంటాక్ సభ్యులు శ్రీనివాసులు రెడ్డి, వై.సూర్యనారాయణ రెడ్డి, ఏపీ నాయి బ్రాహ్మణ సంఘం చైర్మన్ ఆదినారాయణ, రజక కార్పొరేషన్ డైరెక్టర్ పరమేశ్వర్, జనసేన నాయకుడు ఈశ్వర్, వాల్మీకి రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ తలారి కులాయప్ప తదితరులు పాల్గొన్నారు.

దళారుల నుంచి అరటి రైతులను కాపాడాలి

ఎపి రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాయుడు

ప్రజాశక్తి-బెలుగుప్ప

జిల్లావ్యాప్తంగా అరటి పంట సాగు చేసిన రైతులను దళారుల నుంచి కాపాడాలని ఎపి రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి బిహెచ్ రాయుడు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలోని కళ్యాణదుర్గం, బెలుగుప్ప, పుట్లూరు, తాడిపత్రి, యల్లనూరు, తదితర మండలాల్లో అత్యధికంగా అరటి పంటను సాగు చేశారన్నారు. ఇప్పటికే పంటలకు లక్షలకు లక్షలు పెట్టుబడులు పెట్టి సాగు చేశారన్నారు. రైతులు ఆరుగాలం కష్టించి పని చేస్తే దళారులు, కంపెనీ ప్రతినిధులు కుమ్మక్కై మార్కెట్ ధరను నిర్ణయిస్తున్నారన్నారు. గత నెలలో టన్ను అరటి ధర రూ.27వేలు పలికిందన్నారు. ప్రస్తుతం రూ.12వేలు కూడా లేకుండా ధరలను పడిపోవడం బాధాకరమన్నారు. ఉన్నట్టుండి ధరలు పడిపోవడంతో పంట సాగు చేసిన రైతులు దిక్కుతోచని స్థితిలోకి వెళ్లారన్నారు.

ఇందుకు దళారులు, అరటి కంపెనీల ప్రతినిధులు కుమ్మక్కు కావడమే అన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి దళారి వ్యవస్థపై కఠిన చర్యలు తీసుకుని అరటి రైతులను కాపాడాలని కోరారు.

180 చీనీచెట్లు నరికివేత

ప్రజాశక్తి - పుట్లూరు

పుట్లూరు మండల పరిధిలోని గరుగు చింతలపల్లి రైతుకు చెందిన 180 చీనీ చెట్లను శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నరికి వేశారు. ఈ ఘటనకు సంబంధించి గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు గరుగుచింతలపల్లికి చెందిన టిడిపి నాయకులు మంజుల నాగరాజు తన ఐదుఎకరాల పొలంలో 600 చీనీచెట్లను మూడు సంవత్సరాల క్రితం నాటాడు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తోటలోకి చొరబడి 180 చీనీచెట్లను నరికివేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సిఐ సత్తిబాబు, ఎస్ఐ వెంకటనరసింహ ఘటనాస్థలాన్ని పరిశీలించారు. అనంతరం డాగ్‌స్క్వాడ్‌ను రప్పించి సోదాలు చేయించారు. టిడిపి నాయకులు కోమటికుంట కులశేఖర్ రెడ్డి, సుదర్శన్ నాయుడు, విజయ్ తదితరులు నరికిన చీనీచెట్లను పరిశీలించారు. టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్ తదితరులు ఘటనాస్థలాన్ని పరిశీలించి బాధితుడితో మాట్లాడారు. చెట్లను నరికివేసే సంస్కృతి మంచిది కాదని అన్నారు. పోలీసులు వెంటనే స్పందించి చీనీచెట్లను నరికిన నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని అన్నారు.



చీనీతోటలో డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేస్తున్న పోలీసులు

నైపుణ్యంతో స్వయం ఉపాధి సాధ్యం


జిల్లా నైపుణ్య అభివృద్ధి శాఖ అధికారి హరికృష్ణ

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

మనిషిలో నైపుణ్యత ఉంటే ఎక్కడైనా, ఏ ప్రాంతమైన స్వయం ఉపాధికి ఢోకా ఉండదని జిల్లా నైపుణ్య అభివృద్ధి శాఖ అధికారి హరికృష్ణ పేర్కొన్నారు. ప్రస్తుత సమాజంలో డిగ్రీలు, పీహెచ్‌డిలు చేసినా ప్రభుత్వ ఉద్యోగాలు దొరకడం గగనం అవుతోంది. ప్రతి ఏటా నిరుద్యోగ సమస్య పెరిగిపోతోంది. ఉన్నత విద్య చదివిన వారికే ఉద్యోగాలు లేవు, ఇంకా 10 లేక ఇంటర్ ఆపైన చదివిన యువతకు చిన్నపాటి ఉద్యోగాలు దొరకక భవిష్యత్తుకు దారి కన్పించక సతమతమవుతున్నారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో పరిశ్రమలు ఒక్కటే నిరుద్యోగులకు అంతో ఇంతో ఉపాధి కల్పిస్తున్నాయి. ప్రయివేటు రంగ పరిశ్రమలలో ఉద్యోగాలు దొరకాలంటే చేతిలో నైపుణ్యత కలిగి ఉండటం తప్పనిసరి అవుతోంది. ఆ దిశగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యువతలో నైపుణ్యత పెంచడానికి తగిన శిక్షణ ఇస్తూ ప్రోత్సహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో నిరుద్యోగ యువతకు ఇస్తున్న శిక్షణలు, శిక్షణ తర్వాత ఉపాధికి దారి చూపుతున్న తదితర అంశాలపై జిల్లా నైపుణ్య అభివృద్ధి శాఖ అధికారి హరికృష్ణ ప్రజాశక్తికి ఇచ్చిన ముఖాముఖి ఇంటర్వ్యూలో వెల్లడించారు.

ప్రశ్న : మీ శాఖ ద్వారా నిరుద్యోగ యువతకు ఇస్తున్న శిక్షణ వివరాలు గురించి వివరించండి.?

జవాబు : రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, సీడాఫ్, ఉపాధి కార్యాలయం ద్వారా జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో ప్రతినెల ఒక జాబ్ మేళాను నాలుగైదు కంపెనీలతో నిర్వహించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాం. ప్రతి నియోజకవర్గంలో ఒక స్కిల్ హబ్ ను ఏర్పాటు చేసి వివిధ రంగాలలో నిరుద్యోగ యువతకు మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుంది. హిందూపురం పార్లమెంట్ పరిధిలోని రామగిరి మండలంలో స్కిల్ కాలేజ్ ఏర్పాటు చేసి యువతకు ఉచిత శిక్షణ భోజన వసతి కల్పించడం జరుగుతోంది. అలాగే జిల్లాలో మడకశిర, కదిరి, పెనుకొండ, ధర్మవరం, హిందూపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేషనల్ అకాడమీ హిందూపురం తెలుగు చేనేత పారిశ్రామిక శిక్షణ కేంద్రంలోను శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతోంది. శిక్షణ కేంద్రాలలో ఎలక్ట్రానిక్ సెక్టార్, ఐటి, ఐటి ఈఎస్ సెక్టార్, టెక్స్ టైల్, అగ్రికల్చర్, టెలికాం, హాస్పిటాలిటి, అప్పారెల్, సాఫ్ట్‌వేర్, బ్యూటీషియన్, సోలార్ తదితర రంగాల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. పై కేంద్రాల్లో ఈ నెల 20 నుంచి కొత్త బ్యాచ్‌కి శిక్షణ ఇవ్వడం జరుగుతుంది.



ప్ర : గత ఆర్థిక సంవత్సరం నుంచి ఇప్పటివరకు ఎంతమందికి శిక్షణ ఇచ్చారు.?

జ : సత్యసాయి జిల్లాలో ఏర్పాటు చేసిన 8 స్కిల్ హబ్ లు, స్కిల్ కాలేజీల ద్వారా 1268 మందికి శిక్షణ ఇచ్చి వారికి ఉపాధి అవకాశాలు కల్పించడం జరిగింది. వారిలో కొంతమంది స్వయం ఉపాధి కోసం యూనిట్లను ఏర్పాటు చేసుకున్నారు. ప్రస్తుతం జిల్లాలో 470 మంది యువత వివిధ రకాల కోర్సులలో శిక్షణ పొందుతున్నారు.

ప్ర : శిక్షణ పొందిన వారికి ఏయే సంస్థలలో ఉపాధి కల్పించారు.?

జ : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి నెల నియోజకవర్గ కేంద్రాల్లో నాలుగైదు కంపెనీ ప్రతినిధులతో జాబ్ మేళా నిర్వహించి యువతను ఎంపిక చేయడం జరుగుతోంది. సంకల్ప్‌లో భాగంగా ఈ ఏడాది ధర్మవరంలో 99 కంపెనీలతో మెగా జాబ్‌మేళా నిర్వహించాం. కియా అనుబంధ సంస్థలలో టెలీ మహేంద్ర, విప్రో, జెంపాక్ట్, హెటీరో లేబరేటరీస్, డాక్టర్ రెడ్డి లాబరేటరీస్, అమెజాన్ క్యాప్ జెమినీ, అమర్ రాజా బ్యాటరీస్, గ్రీన్ టెక్, ప్రైవేట్ బ్యాంక్స్, కిమ్స్ హాస్పిటల్స్ మరియు బహుళ జాతీయ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతోంది.

ప్ర: నైపుణ్య అభివృద్ధికి సహకరిస్తున్న ఇతర సంస్థల వివరాలు.?

జ : కలెక్టర్ అధ్యక్షతన జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మా శాఖకు సీడాఫ్, జిల్లా ఉపాధి కల్పన కేంద్రం, డిఆర్‌డిఎ, డిఐసి, హ్యాండ్లూమ్స్ మరియు టెక్స్ టైల్, ఇతర ప్రభుత్వ శాఖలు స్వచ్ఛంద సంస్థలు సహకరిస్తున్నాయి.

ప్ర: మీ శాఖ ద్వారా చేపడుతున్న ఇతర కార్యక్రమాలు ఏమిటి.?

జ : సంకల్ప ప్రాజెక్టులో భాగంగా డిఆర్‌డిఎ వారి సహకారంతో సొంతంగా వ్యాపారాలు చేసుకునే మహిళలకు శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. వివిధ రంగాల్లో 120 మంది మహిళలకు శిక్షణ ఇవ్వడం జరిగింది. హిందూపురంలో ఇండియన్ డిజైన్ గార్మెంట్స్ ఇండస్ట్రీలో 60 మంది మహిళలకు శిక్షణ ఇవ్వడం జరిగింది. అలాగే 13 ప్రభుత్వ, ప్రయివేటు డిగ్రీ కళాశాలల్లో డిగ్రీ చదివే విద్యార్థులకు ఇంగ్లీష్ అండ్ కమ్యూనికేషన్, సాఫ్ట్ వేర్, సాఫ్ట్ స్కిల్స్ నందు శిక్షణ ఇవ్వడం జరిగింది. జిల్లాలో డిగ్రీ పూర్తి చేసుకున్న యువతి యువకులకు ఏపీలోని 500 కంపెనీలలో ఇంటర్న్ షిప్ చేయడానికి సహకరించడం జరుగుతోంది. అలాగే జర్మనీలో ఉద్యోగ అవకాశాలు కల్పనకు ఆరు నెలలపాటు భాషపై శిక్షణ ఇచ్చి జర్మనీలో 3 లక్షల 20 వేల రూపాయల వేతనంతో ఉద్యోగ అవకాశం కల్పిస్తాం. ప్రభుత్వ సహకారంతో వారిని జర్మనీకి పంపడం జరుగుతుంది. పిఎం విశ్వకర్మ ప్రోగ్రాం ద్వారా జిల్లాలో 18 రకాల చేతివృత్తుల వారికి తగిన శిక్షణ ఇవ్వడం జరుగుతోంది.



జిల్లా నైపుణ్య అభివృద్ధి శాఖ అధికారి హరికృష్ణ

ప్ర : నిరుద్యోగ యువతకు మీరు ఇచ్చే సలహాలు సూచనలు ఏమిటి? మీ శాఖలో సిబ్బంది కొరత ఉందా.?

జ: సిబ్బంది కొరత లేదు. నిరుద్యోగ యువత ఉద్యోగాలపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ఏపీ నైపుణ్య అభివృద్ధి సంస్థ, సీడాఫ్, ఉద్యోగ ఉపాధి కార్యాలయం డిఆర్‌డిఎ సంస్థల ద్వారా స్కిల్ హబ్, స్కిల్ కాలేజీల ద్వారా జరిగే శిక్షణలలో పాల్గొని ఉపాధి అవకాశాలు పొందవచ్చు. జర్మనీలో ఉద్యోగాల కోసం ఆరు నెలల పాటు శిక్షణ ఇచ్చి ఆ దేశంలో ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుంది. నిరుద్యోగ యువత కోసం ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాను. ఇతర సందేహాల నివృత్తికి, శిక్షణల సమాచారానికి 99888 53335 లేదా 87126 55686 కి ఫోన్ చేసి సంప్రదించవచ్చు.

'అమరజీవి' త్యాగం మరువలేం..

జయంతి కార్యక్రమంలో జెఎన్‌టియు విసి సుదర్శనరావు


నివాళులర్పిస్తున్న జెఎన్‌టియు ఉపకులపతి హెచ్.సుదర్శనరావు

ప్రజాశక్తి-అనంతపురం

భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు జీవితాన్నే త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు సేవలు మరువలేనివని జెఎన్‌టియు ఉపకులపతి హెచ్.సుదర్శనరావు అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని ఆదివారం అనంతపురం జెఎన్‌టియు విశ్వవిద్యాలయంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధనకు ఆమరణ నిరాహార దీక్ష చేసి, ప్రాణాలర్పించిన మహనీయులు శ్రీరాములు అన్నారు. ఆయన త్యాగం వల్లే భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారణమైందన్నారు. ఆయన విశిష్ట వ్యక్తిత్వం, పట్టుదలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, యూనివర్సిటీ డైరెక్టర్లు పివిఆర్ భానుమూర్తి, జివి సుబ్బారెడ్డి, ఎస్‌వి సత్యనారాయణ, పి.సుజాత, సురేష్‌బాబు, కిరణ్మయి, సురేష్‌బాబు, దుర్గాప్రసాద్, పివి శివకుమార్, ఫైనాన్స్ ఆఫీసర్ శిరాజుద్దీన్, కళాశాల ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి, కె.మాధవి, ఎం.రామశేఖర్‌రెడ్డి, వర్సిటీ డీఆర్‌లు, ఏఆర్‌లు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని నగరంలోని విగ్రహానికి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అమరజీవి త్యాగం ఫలితంగానే ఆంధ్ర రాష్ట్రం అవతరించిందన్నారు. ఆయన త్యాగాన్ని ఎప్పటికీ మరువలేమన్నారు. ఆయన్ను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు.

అనంతపురం కార్పొరేషన్ : తెలుగు భాషా మాట్లాడే వారందరికీ ప్రత్యేక రాష్ట్రం కావాలని నినదించి రాష్ట్ర సాధనకై జీవితాన్ని త్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు జీవితం అందరికీ ఆదర్శప్రాయం అని మేయర్ మహమ్మద్ వసీం కొనియాడారు. ఆదివారం నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి, ప్రాణ త్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు వాసంతి, విజయ భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఎస్ఇ చంద్రశేఖర్, ఇఇ నరసింహులు, సిబ్బంది పాల్గొన్నారు.

అనంతపురం రూరల్ : ఎమ్మెల్యే దగ్గుపాటి సూచనల మేరకు అర్బన్ టిడిపి కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బుగ్గయ్య చౌదరి, అనుసర్తి అభివృద్ధి కమిటీ సభ్యులు గంగారం, మైనారిటీ నాయకులు సయ్యద్ సైఫుద్దీన్, కృష్ణం రఘు, తాతి మధు, తదితరులు పాల్గొన్నారు.

యాడికి : ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం వద్ద ఉన్న అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి పౌరోహితుడు దత్త స్వామి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు ఆదిత్య పవన్, శేఖర్ రాజు, విశ్వనాథ్, సతీష్, ప్రదీప్, నితిన్, రవి, అర్జున్, తదితరులు పాల్గొన్నారు.


కళ్యాణదుర్గం రూరల్ : పట్టణంలోని ప్రజావేదికలో టిడిపి నాయకులు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు హాజరై మాట్లాడుతూ రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు సేవలు మరువలేనివన్నారు. ఆశయ సాధన కోసం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే నాయకుడి ఆధ్వర్యంలో మన ప్రాంతాన్ని అభివృద్ధి చేద్దామని పిలుపునిచ్చారు.

రాష్ట్ర ఉత్తమ సామాజిక సేవా అవార్డు గ్రహీత చల్లా కిషోర్‌చౌదరి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక చల్లా కాంప్లెక్స్‌లో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల సంఘం గౌరవాధ్యక్షులు చల్లా రాజశేఖర్‌చౌదరి, సీనియర్ జెర్నలిస్టు లింగప్రసాద్, టీచర్స్ శివానంద, రవి, బాల రామ్మోహన్, స్ఫూర్తి ఫౌండేషన్ నరసింహులు, హిందీ నరసప్ప అల్లుడు నారాయణ, ఓబుళరాజు, ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయులు కిరణ్, సెరికల్చర్ ఆఫీసర్ బాలకృష్ణ, వెటర్నరీ మల్లికార్జున, రోజ్లీ రాజేష్, మెడికల్ సోమశేఖర్, హనుమంతురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : రాయదుర్గంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో కోటలోని నగరేశ్వర స్వామి ఆలయంలో పొట్టి శ్రీరాములుకు నివాళులర్పించారు. ఇందులో భాగంగా విగ్రహానికి పూలమాల వేసి కేక్ కోసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు జయంతి సురేష్ కుమార్, చిందనూరు సుదర్శన్, శ్రీమన్నారాయణ, గెల్లి వాసు ఉమామహేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : అమరజీవి పొట్టి శ్రీరాములు జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకొని సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని టిడిపి వార్డు సభ్యులు నిరంజన్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి వార్డు సభ్యులు చేజాల ప్రభాకర్, మీనుగ రామాంజనేయులు, మీనుగ రవి, ఆటో సీనా, ఆపద్బాంధవ ట్రస్టు అధ్యక్షులు మురళి, నవీన్, నూరు, ఈడిగ వేణు, శంకర్, సుదర్శన్, స్కూల్ కమిటీ చైర్మన్ గోపాల్, మోపిడి చంద్ర, పిసి రాజు, గంగాధర్, ఎలక్ట్రీషియన్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని పత్తికొండ రోడ్డు కూడలిలో ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గుంతకల్లు మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ నైరుతి రెడ్డి, వైసిపి గుత్తి పట్టణ అధ్యక్షులు కె.మధుసూదన్‌రెడ్డి, కౌన్సిలర్ వి.వరదరాజులు, వైసిపి నాయకులు జీపు రమణ, ఎం.రంగస్వామి, బి.రమేష్ రెడ్డి, గోపీనాథ్ రెడ్డి, అబ్దుల్, వరిగడ్డి షేక్షావలి, డి.షఫీ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాకం శ్రీకాంత్, కె.కిషోర్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు సుదర్శన్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.


అనంతపురంలో పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, మేయర్ వసీం, కళ్యాణదుర్గంలో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు


పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న నిత్యసురభి ట్రస్టు చైర్‌పర్సన్ నిర్మలమురళి

పేదలకు దుస్తులు పంపిణీ

అనంతపురం సిటీ : నిత్యసురభి ఛారిటబుల్ ట్రస్టు, పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో ఆదివారం ఆదర్శనగర్‌లోని గుడిసెల్లో నివాసం ఉంటున్న పేద కుటుంబాలకు ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు చైర్‌పర్సన్ ఎస్.నిర్మలమురళి మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు త్యాగానికి గుర్తుగా సేవ చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వివాదాల జోలికి వెళ్లొద్దు


స్థానికులతో మాట్లాడుతున్న అర్బన్ సిఐ జయానాయక్

రాయదుర్గం రూరల్ : వివాదాల జోలికి వెళ్లకుండా ప్రశాంత వాతావరణంలో సామరస్యంగా ఉండాలని సిఐ జయానాయక్ సూచించారు. ఆదివారం మండల పరిధిలోని మెచ్చిరి గ్రామంలో సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. సమస్యాత్మక గ్రామం కావడంతో అనుమానితుల, పాత నేరస్థుల ఇళ్లను, దుకాణాలను తనిఖీ చేశారు. గ్రామంలో కలియ తిరుగుతూ ప్రజలతో మాట్లాడారు. సీసీ కెమెరాల ఆవశ్యకతను వివరించారు. వేసవి కాలం కావడంతో అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా సైబర్ నేరాలు, మోటార్ వెహికల్ చట్టంపై అవగాహన కల్పించారు.

ఘనంగా ఓబులేసు స్వామి ఉత్సవాలు

యల్లనూరు : మండల కేంద్రంలో వెలసిన ఓబులేసు స్వామి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. శనివారం ఉదయం ప్రారంభమైన ఉత్సవాలు ఆదివారం వరకూ సాగాయి. ఇందులో భాగంగా స్వామివారికి బియ్యం, బెడలు సమర్పించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గ్రామపెద్దల సమక్షంలో స్వామివారిని యల్లనూరు నుంచి బొప్పేపల్లి వరకూ కాడెద్దుల బండిలో ఊరేగింగా కోనకు చేరుకుని రాత్రికి పవలిస్తాడు. తిరిగి ఓబులేసు స్వామి యల్లనూరు గ్రామానికి చేరుకోవడం ఆనవాయితీ. అనంతరం గ్రామ దేవత పెద్దమ్మతల్లి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. కాగా రాతి దూలం లాగుడు పోటీలు నిర్వహించారు. అనంతరం మొదటి బహుమతి ఎద్దుల యజమానులకు రూ.50వేలు, 2వ బహుమతి రూ.40వేలు, 3వ బహుమతి రూ.30వేలు, 4వ బహుమతి రూ.20వేలు, 5వ బహుమతి రూ.10వేలు, 6వ బహుమతి రూ.5వేలు ప్రదానం చేశారు.

ఎస్సీ సెల్ అధ్యక్షుడికి సన్మానం

కుందుర్పి : తాలూకా ఎస్సీ సెల్ అధ్యక్షులు ఎన్.తిప్పేస్వామిని ఎంపిపి కమల నాగరాజు, కలిగులిమి భంభం బాబా భక్తులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ భంభం బాబా ఆశ్రమం నిర్మాణం కోసం మండల వ్యాప్తంగా కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఎస్సీ సెల్ తాలూకా అధ్యక్షులతోపాటు, వైసిపి నాయకుడు ఉమామహేశ్వరనాయుడు, డిఎన్ మూర్తిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కలిగులిమి భంభం బాబా భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఎఎస్ఐకి ....

కుందుర్పి : మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన ఎఎస్ఐ వెంకటేషులను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ బొజ్జప్ప మాట్లాడుతూ శాంతి భద్రతలపైన ప్రత్యేక దృష్టి సారించి ప్రజలను అన్నివిధాలుగా కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కొత్తపల్లి ఈరన్న, డిసిసి మాజీ సెక్రటరీ గౌని తిప్పేస్వామి, ఎర్ర రామాంజినేయులు, మండల జనరల్ సెక్రటరీ అపిలేపల్లి మారుతి, బొట్టు ఆంజనేయులు, నిజవల్లి గోపాల్, హనుమంతురాయుడు, రామప్ప, చిక్కన్న, గురువేపల్లి దేవేంద్ర, అపిలేపల్లి గొల్ల రామాంజనేయులు, మండలపల్లి హనుమంతురాయుడు, తదితరులు పాల్గొన్నారు.


ఏఎస్ఐను సన్మానిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు


ఉద్యోగ విరమణ సభలో మాట్లాడుతున్న ప్రముఖులు

సివి జార్జ్ సేవలు ఆదర్శనీయం

ఉద్యోగ విరమణ సభలో ప్రముఖులు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఉపాధ్యాయుడిగా, ఉపాధ్యాసంఘం నేత, సామాజిక సేవారంగాల్లో సివి జార్జ్ అందించిన సేవలు ఆదర్శనీయంగా నిలిచాయని పలువురు ప్రముఖులు కొనియాడారు. పదవీ విరమణ చేసిన సందర్భంగా ఆదివారం అంబేద్కర్ భవన్‌లో కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో జార్జ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్‌వి రమణయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తం, కార్యనిర్వహణ, పాల్ థామస్ ట్రస్టు చైర్మన్ కరుణాకర్ పాల్, ప్రజా సైన్స్ వేదిక అధ్యక్షులు సురేష్, రిటైర్డ్ డిఇఒ లక్ష్మీనారాయణ, ఎంఇఒ నాగరత్నమ్మ, ఎంపిడిఒ సొలమన్‌రాజ్ మాట్లాడుతూ 26 ఏళ్లుగా వందలాదిమంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్ది ఉద్యోగ విరమణ చేసిన సి.వి జార్జ్ ఉత్తమ సేవలు అందించి ప్రజలు అధికారుల మన్ననలను పొందారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఎంఇఒ గురు ప్రసాద్, ఎంఇఒ నివేద, ఎపిటిఎఫ్ పూర్వ నాయకులు నరసింహులు, ఎపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్, పాతిరెడ్డి, ఆర్‌ఇఎఫ్ రామచంద్ర, రమణారెడ్డి, పిఎస్‌హెచ్‌ఎన్ ప్రెసిడెంట్ గోవింద్ రెడ్డి, వాల్మీకి సంఘం అధ్యక్షులు గంగాధర్, ఆర్‌ఇఎఫ్ రాష్ట్ర కన్వీనర్ నారాయణనాయక్, తదితరులు పాల్గొన్నారు.

చలో విజయవాడను విజయవంతం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో పని చేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 19న విజయవాడలోని ధర్నా చౌక్ వద్ద నిర్వహించనున్నట్లు సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి అచ్యుత్‌ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లావ్యాప్తంగా మారమూల ప్రాంతాలకు తాగునీరు అందిస్తూ ప్రజలకు సేవలందిస్తున్న శ్రీరామిరెడ్డి కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్నారు. ప్రధానంగా కార్మికులకు రావాల్సిన వేతనాలు, పెండింగ్‌లో ఉన్న పిఎఫ్ సమస్యలు పరిష్కరించాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, క్యూ సి క్యూ ఎ కమిటీ రద్దు చేయాలని, ప్రతినెలా 5వతేదీన జీతాలు చెల్లించాలని, రాష్ట్ర బడ్జెట్‌లో తాగునీటి ప్రాజెక్టులకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలు కోరుతూ సిఐటియూ ఆధ్వర్యంలో జరిగే మహాధర్నాలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయం

మంత్రి సవిత

పెనుకొండ : మహిళా సాధికారతే సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వ ధ్యేయమని, మహిళల ఆర్థిక అభ్యున్నతి కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని రాష్ట్ర బీసీ, ఈబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఆదివారం పట్టణంలోని మార్కెట్ యార్డులో శ్రీసత్యసాయి జిల్లా రచయిత సంఘం ఆధ్వర్యంలో మహిళ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, జిల్లా ఎస్పీ రత్న హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు రంగాల్లో రాణించిన మహిళలకు మహిళా శిరోమణి పురస్కారాలను మంత్రి అందజేశారు. మంత్రి సవిత, ఎమ్మెల్యే పరిటాల సునీత పౌరసన్మానంతో సత్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ మహిళల అభ్యున్నతికి సిఎం చంద్రబాబు అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. సిఎం చంద్రబాబునాయుడు తన పాలనలో మహిళలకు వెన్నుదన్నుగా నిలిచారన్నారు. విద్యా, ఉద్యోగావకాశాల్లో 33.33 శాతం రిజర్వేషన్లు కల్పించారన్నారు. రాజకీయాల్లోనూ వారికి ప్రాధాన్యమిచ్చారని తెలిపారు. ఆర్థికంగా, ఆరోగ్యపరంగా భరోసా ఇస్తూ పలు పథకాలను రూపకల్పన చేశారన్నారని కొనియాడారు. డ్వాక్రా సంఘాల ఏర్పాటు చేసి, మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్య కల్పించారని దీపం పథకానికి శ్రీకారం చుట్టారని అన్నారు. 1 లక్షా 2 వేల మంది మహిళలకు టైలరింగ్ లో శిక్షణ అందజేసి, ఉచితంగా కుట్టు మిషన్లు అందజేస్తున్నామని మంత్రి వివరించారు.

ఇమామ్ అన్నా..సలాం..

చిరు జీవితం..గొప్ప ఆశయం..-ప్రజల దాహార్తి తీరుస్తున్న ఆటో డ్రైవర్



ప్రయాణికులకు నీరు అందిస్తున్న ఆటో డ్రైవర్ ఇమామ్

ప్రజాశక్తి -అనంతపురం సిటీ

చిన్నపాటి సాయం చేసి గొప్పలు చెప్పుకునే రోజుల్లో రాత్రి, పగలు కష్టపడి కుటుంబాన్ని పోషించుకునేది కాకుండా 'సొంత లాభం కొంత మానుకుని. పొరుగు వాడికి తోడ్పడవోయ్..' అని గురజాడ పదజాలం నుంచి వచ్చిన ముత్యాలను స్వీకరించిన అనంతపురం నగరం రంగస్వామి నగర్‌కు చెందిన ఇమామ్ పదిమందికి తన వంతు సాయం చేసి ఆత్మసంతృప్తిని పొందే గొప్ప ఆలోచన చేశాడు. ఇమామ్ కుటుంబ పోషణలో భాగంగా రాత్రి పూట ప్రజాశక్తి దినపత్రికలో వాచ్‌మెన్ ఉద్యోగం చేస్తూ.. పగలు ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సంసారభారం ఉన్నప్పటికీ ప్రజలకు సేవ చేయాలని తపనతో 'నేను చేస్తున్నది చిన్నపాటి సేవ మాత్రమే..' అని వినయంగా చెప్పుకునే మనస్తత్వంతో మండే వేసవిలో ప్రజల దాహన్ని తీరుస్తున్నారు. రాత్రి సమయంలో వాచ్‌మెన్‌గా, పగలు ఆటో డ్రైవర్‌గా తన జీవనం.. కాకపోతే తనకు వచ్చే దానిలో సంసారం, పిల్లల చదువుతో పాటు నలుగురికి తనకు చేతనైనంత సహాయం చేయాలని తన ఆటోలో కూల్ వాటర్ క్యాన్ ఏర్పాటు చేసుకుని 'నేను రైతు బిడ్డను' అంటూ బోర్డు వేసుకొని ఎందరికో వేసవిలో దాహార్తి తీరుస్తున్న ఇమామ్‌ను స్థానికులు అభినందిస్తున్నారు. ఇది చాలా చిన్న సహాయమే అయినా తనకు చేతనైనంతలో రెండేళ్లుగా చేస్తున్నానని చెబుతున్నాడు. వేసవిలో రోజూ దాదాపు 5 క్యాన్ల వరకూ నీరు ఖర్చు అవుతోందని చెప్పాడు. ఎందరో రైతులు.. చదువుకునే పిల్లలు ఆటో నడిపే సమయంలో చూస్తూ ఉంటానని చాలాచోట్ల ఏదైనా తింటేనే మంచినీళ్లు ఇస్తామని చెబుతూ ఉంటారన్నారు. అలాంటి వారి కోసం మంచి నీరు అందించాలని ఉద్దేశంతో ఈ ఆలోచన చేశానని ఇమామ్ తెలిపారు. అంతేగాకుండా బయటి ప్రాంతాల నుంచి చాలామంది నగరానికి ఎన్నో పనుల మీద వస్తూ ఉంటారన్నారు. వారి దాహార్తి తీర్చేందుకు చల్లని నీరు అందిస్తున్నట్లు తెలిపారు. ఏదిఏమైనా చిన్న జీవితం పెద్ద ఆలోచనలు చేసిన ఆయన ఆశయం గొప్పదని పలువురు ప్రశంసిస్తున్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-బెలుగుప్ప


నివాళులరిస్తున్న సిడిపిఒ శ్రీదేవి

గూబనపల్లి గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన బెలుగుప్ప మండలం నరసాపురం గ్రామానికి చెందిన అంగన్వాడీ ఆయా లక్ష్మి కుటుంబానికి ఆదివారం ఆర్థికసాయం అందజేశారు. లక్ష్మీ శనివారం మృతిచెందిన విషయం తెలిసిందే. విషయం తెలుసుకున్న సిడిపిఒ శ్రీదేవి ఆదివారం నరసాపురం గ్రామానికి చేరుకుని మృతురాలి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం దహన సంస్కారాలు కోసం లక్ష్మీ భర్త హొన్నూరుస్వామికి రూ.15వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు సత్యవతి, మారుతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి కార్యకర్తకు పరామర్శ

గుత్తి : మండలంలోని ఈశ్వరపల్లి గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్త రామాంజనేయులును వైసిపి నాయకులు ఆదివారం పరామర్శించారు. రామాంజనేయులు ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఆస్పత్రులో చికిత్స పొంది ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న గుంతకల్లు మున్సిపల్ వైస్ ఛైర్‌పర్సన్ నైరుతిరెడ్డి, వైసిపి పట్టణ అధ్యక్షులు కె.మధుసూదన్‌రెడ్డి గ్రామంలోని ఇంటికి వెళ్లి పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ వి.వరదరాజులు, మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ సి.మల్లయ్యయాదవ్, తదితరులు పాల్గొన్నారు.


రామాంజనేయులును సన్మానిస్తున్న నైరుతిరెడ్డి

ఘనంగా గురతిప్పేరుద్ర స్వామి రథోత్సవం

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం


రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

మండల పరిధిలోని ఎరడికెర గ్రామంలో వెలసిన తిప్పేరుద్ర స్వామి రథోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. తిప్పేరుద్రస్వామికి మూడు రోజులపాటు ప్రత్యేక పూజల అనంతరం ఆదివారం సాయంత్రం తిప్పేరుద్రస్వామి ఉత్సవ మూర్తులను పల్లకిలో ఊరేగించారు. తర్వాత వేలాది మంది భక్తదుల మధ్య రథోత్సవం నిర్వహించారు. పలువురు భక్తులు గజమాలలతో స్వామివారి రథాన్ని అలంకరించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కాగా ఈ రథోత్సవ కార్యక్రమానికి ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రంలోని విశేష జనసందేహం మధ్య రథోత్సవం సాగింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనా జరగకుండా ఎస్ఐ నరేంద్రకుమార్ గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

నేటి నుంచి 'పది' పరీక్షలు

నార్పల : మండల కేంద్రంలో నేటి నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు మండల విద్యాధికారి కృష్ణయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా దాదాపు 714 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఇందుకోసం ముగ్గురు సూపరింటెండెట్లు, ముగ్గురు డిపార్ట్మెంట్ అధికారులు, 32 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు తెలిపారు.

నేరాలు ఘోరాలు

వివాహిత ఆత్మహత్య


మృతిచెందిన కవిత

నార్పల : మండల కేంద్రంలోని సుల్తాన్‌పేటకు చెందిన కవిత (28) ఆత్మహత్య చేసుకుంది. బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శివయ్య, కవిత దంపతులకు ఇద్దరు సంతానం ఉన్నారు. అయితే కొద్దికాలంగా సుల్తాన్ పేటకు చెందిన లక్ష్మీనారాయణ అనే వ్యక్తి కవితను వేధింపులకు గురి చేసేవాడు. ఈ విషయమై గతంలో వివాదాలు జరిగాయని స్థానికులు చెబుతున్నారు. శనివారం రాత్రి కూడా లక్ష్మీనారాయణ, కవితను వేధింపులకు గురి చేయడంతో మనస్థాపం చెంది తన ఇంట్లో ఉరేసుకుని కవిత ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతురాలు తల్లి రామసబ్బమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాగర్ తెలిపారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం సర్వజన ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో 25 మందికి గాయాలు

ఆరుగురు బళ్లారికి తరలింపు


చికిత్సపొందుతున్న బాధితులు, ప్రమాదానికి గురైన ఆటో

ఉరవకొండ : మండలంలోని చిన్నముష్టూరు గ్రామం వద్ద ఆదివారం రోడ్డు ప్రమాదంలో 25 మంది గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. బొమ్మనహాల్ మండలం అరేసముద్రం గ్రామం నుంచి ఉరవకొండ మండలం మోపిడి గ్రామానికి శ్రీమంతం కార్యక్రమానికి వెళ్తుండగా చిన్నముష్టూరు వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో వాహనంలో 30 మంది ప్రయాణిస్తుండగా 25 మంది గాయపడ్డారు. గాయపడ్డ వారిని ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో లింగమ్మ, హనుమక్క, సురేష్, జయలక్ష్మి, వనిత పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం బళ్లారి ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

పెద్దవడుగూరు : మండలంలోని గుత్తి అనంతపురం గ్రామానికి చెందిన రాము(42) ఆదివారం నిద్ర మాత్రం మింగే ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. కుటుంబ కలహాల కారణంగానే ఇతను నిద్ర మాత్రలు మింగే ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. ఇతనికి భార్య పిల్లలు ఉన్నారని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.